గ్రామ పంచాయతీలకు

## ప్రత్యేక అధికారుల నియామకం

**దువ్వూరు, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. సర్పంచుల పదవీ కాలం గురువారం ముగియడంతో శుక్రవారం ప్రతి గ్రామ పంచాయతీకి మండలంలో పనిచేసే గెజిటెడ్ అధికారులను జిల్లా కలెక్టర్ శ్రీధర్ నియమించారు. దువ్వూరు, చింతకుంట, గుడిపాడు గ్రామ పంచాయతీలకు ఎంపీడీవో సుబ్బారెడ్డిని, కానుగూడూరు, చిన్నసింగన పల్లె, నీలాపురం గ్రామ పంచాయతీలకు తహసిల్దార్ సంజీవరెడ్డిని, కృష్ణంపల్లె, ఎర్రబల్లె, ఎంకుపల్లె గ్రామ పంచాయతీలకు వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డిని, సంజీవరెడ్డి పల్లె, మదిరే పల్లె, పెద్దజొన్నవరం లకు పశువైద్య అధికారిని అలాగే జిల్లెల్ల, సి.చల్లబసాయి పల్లె, బుక్కాయ పల్లెలకు ఈఓపిఆర్డి హరికృష్ణను, నేలటూరు, మాసనపల్లె గ్రామాలకు విద్యాశాఖ అధికారి భాస్కర్ ను, మూడిళ్లపల్లె, ఇడమడక, భీమునిపాడు గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో రమణారెడ్డిని, ఏఎస్ పల్లె, నారాయణ పల్లె, బయనపల్లె గ్రామాలకు విద్యాశాఖ అధికారి రమణయ్యను నియమించారు. ఈ మేరకు శనివారం నుండి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో వీరు బాధ్యతలు చేపట్టి ఆ గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివిధ రకాల అభివృద్ధి పనులు అలాగే పారిశుధ్యం, మంచినీటి సరఫరా తదితర పనులను పర్యవేక్షించవలసి ఉంటుంది.


వైఎస్ఆర్ కడప వార్త

తెలుగు జాతీయ దినపత్రిక
శనివారం 04 ఏప్రిల్ 2026


## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**వేంపల్లె ఏప్రిల్ 03 ప్రభాతవార్త**



మద్యం దుకాణాల యజమానులు ప్రతి ఒక్కరూ తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సీఐ టి.నరసింహులు సూచించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం తన సిబ్బందితో కలిసి పట్టణంలోని మద్యం దుకాణాలను పరిశీలించారు. అనంతరం సీఐ టి.నరసింహులు మాట్లాడుతూ, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలు, గొడవలు వంటి అసాంఘిక కార్యకలాపాలను సమర్థవంతంగా నియంత్రించవచ్చని తెలిపారు. అలాగే మద్యం కొనుగోలు కోసం వచ్చే వ్యక్తులు నిబంధనలు పాటించేలా దుకాణ యజమానులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మైనర్లకు మద్యం విక్రయించరాదని తెలిపారు. దుకాణాల వద్ద శాంతిభద్రతలు కాపాడటం యజమానుల బాధ్యత కూడా అని సూచించారు. పోలీసు శాఖ సూచనలు పాటిస్తూ సహకరించాలని యజమానులను కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో రైల్వేస్టేషన్ల అభివృద్ధికి నిధులు

- రాజంపేట, ఒంటిమిట్టలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు
- ప్రొద్దుటూరు,జమ్మలమడుగు రైల్వేస్టేషన్ల ప్లాట్ ఫాం విస్తరణ
- ఎర్రగుంట రైల్వే స్టేషన్‌కు 2 లిఫ్టులు

**రాజంపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

జిల్లాలో రైల్వే స్టేషన్లో అభివృద్ధికి దక్షి ణ మధ్య రైల్వే నిధుల మంజూరుపై దృష్టి సారించింది. ఇప్పటివరకు అమృత్ భారత్ పథకం ద్వారా రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేసిన రైల్వే బోర్డు రైల్వే ప్లాట్ఫామ్ లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు లిఫ్టులు ఏర్పాటుపై చర్యలు చేపట్టింది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా స్థానిక అధికారుల ప్రతిపాదన మేరకు ఈ చర్యలు చేపట్టింది. కొత్త రైల్వే స్టేషన్లలో ప్లాట్ ఫాం అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్ లభించింది. దశాబ్దాలుగా ఫ్లాట్ ఫాంల ఎత్తు లేకుండా ఉన్న సమస్యను తాజాగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేశారు. సిమెంట్ పరిశ్రమలకు పుట్టినిల్లు అయిన ఎర్రగుంట్లలో రైల్వే ప్రయాణికుల కోసం రెండు లిఫ్టులు ఏర్పాటు చేసేందుకు అనుమతి లభించింది అలాగే కలమల్ల రైల్వేస్టేషన్లో ప్లాట్ఫారం విస్తరణకు కలిపి 4.42 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. హస్తవరం పుల్లంపేట రైల్వే స్టేషన్లలో ప్లాట్ఫాముల విస్తరణకు 7.23 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒంటిమిట్ట ,నందలూరు రైల్వే స్టేషన్లలో కూడా ప్లాట్ఫాముల అభివృద్ధికి 8.97 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. ఒంటిమిట్ట, మంటపంపల్లెలో మూడు మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను,2.73 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి.







రాజంపేటలో ఆరు మీటర్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిని1.62 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు. అనంతరాజుపేట ,సెట్టిగుంట రైల్వే స్టేషన్ల ప్లాట్ఫామ్ విస్తరణకి 4.42 కోట్ల నిధులు మంజూరు చేశారు. పసిడిపురి పొద్దుటూరు, జమ్మలమడుగు రైల్వే స్టేషన్లో ప్లాట్ ఫాం ల అభివృద్ధికి 5. 94 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి.

## రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు

**దువ్వూరు, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కడపకర్నూల్ జాతీయ రహదారిపై పెద్ద జొన్నవరం మెట్ట వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని ముగ్గురికి గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి... ఒక కారులో మంత్రాలయం నుండి కడపకు పోవు కారులో నలుగురు ఉండగా, మరొక కారు కడప నుండి నంద్యాలకు పోవు కారులో ముగ్గురు ఉన్నారు. కడప నుండి నంద్యాలకు పోవు కారు పంచర్ కాగా అటువైపు వెళుతున్న కారు దాటుకొని వచ్చి కారును ఢీకొంది. దీంతో రెండు కార్లలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలు అయ్యాయి. శ్రీనివాసాచారి, మణివర్ధన్ రెడ్డి, గౌతమ్ లకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలు అయ్యాయి. వీరిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో నలుగురిని చాగలమర్రి కేరళ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని దువ్వూరు పోలీసులు పరిశీలించారు.



# చలి వేంద్రం ...... వివాదం

- వైసీపీ-టీడీపీ మధ్య ఆరోపణలు, ప్రతియా రోపణలు
- సొంత ఖర్చుతో నిర్మించిన బస్ షెల్టర్‌లో రాజకీయ హంగామా
- పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నేతలు పిర్యాదు

**పులివెందుల, ఏప్రిల్ 3,ప్రభాతవార్త :**


పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకి పిర్యాదు చేస్తున్న వైసీపీ నేతలు

పట్టణంలో ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన చలివేంద్రం రాజకీయ వివాదానికి దారితీసింది. వెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో బస్ స్టాండ్ వద్ద మేము ఏర్పాటు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసిన చోట టీడీపీ వర్గీయులు దౌర్జన్యంగా చలి వేంద్రం ఏర్పాటు చేశారని న్యాయం చేయాలని గురువారం అర్బన్ ఎస్సై తిమోతికి వైసీపీ నేతలు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై తో మున్సిపల్ మాజీ చైర్మన్ వరప్రసాద్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా నిరంతరంగా ప్రయాణికులకు చల్లటి నీరు అందించే ఉద్దేశంతో చలువ పందిరి, చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న అని , ఒక లక్ష రూపాయల సొంత నిధులతో బస్ షెల్టర్ నిర్మించి చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న అని ఈ నిర్మాణానికి వైఎస్సార్సీపీ రంగులు వేయబడింది అని గౌరవ ఎంపీ చేతుల మీదుగా ప్రారంభించాలని యోచించగా, ఇదే సమయంలో టీడీపీ నాయకులు రాత్రి కి రాత్రి అక్కడికి చేరుకుని హంగామా సృష్టించి వారు తమ పార్టీ బ్యానర్లు కట్టి, ఇప్పటికే ఏర్పాటు చేసిన పందిరి కింద చలివేంద్రం ప్రారంభించారని ఆరోపించారు.ప్రజలకు ఎండలో ఇబ్బంది లేకుండా చల్లటి నీరు అందించడమే తన ఉద్దేశమని, ప్రభుత్వం ఉన్నా లేకపోయినా సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నా నని ఆయన తెలిపారు. రాజకీయ లాభాల కోసం ఇలాంటి చర్యలు చేయడం సిగ్గుమాలిన విషయం అని విమర్శించారు.ఇక మరోవైపు, ప్రజలకు సేవ చేయాలనే నిజమైన ఉద్దేశం ఉంటే ఎక్కడైనా చలివేంద్రాలు ఏర్పాటు చేయవచ్చని, సొంత నిధులతో ప్రజా సేవ చేయాలని సూచించారు. అలాగే పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించడం, ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తి చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని కోరారు. తన తండ్రి కీర్తిశేషులు శ్రీ వల్లెపు నాగప్ప పేరిట ప్రజల సౌకర్యం కోసం బస్ షెల్టర్ నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్‌లో తీర్మానం (నెం. 437) ఆమోదం పొందిందని తెలిపారు.ఈ ఘటనతో స్థానికంగా రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. అయితే టీడీపీ నేతలు మాత్రం ప్రభుత్వ స్థలం ఎవరి జాగీరు కాదని ప్రజల సేవకోసం ఎవరైన ప్రభుత్వం స్థలంలో ఏర్పాటు చేసుకొనే హక్కు ఉందని టీడీపీకి మంచి పేరు వస్తుంది అని వైసీపీ నాయకులు డ్రామాలు ఆడుతున్నారు అని గత పాలనలో ఇష్టానుసారం అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అక్రమ కట్టడాలు కట్టి ఇది మా సొంతం అన్నట్లు వ్యవహరిస్తున్నారు అని అనడానికి ఇది నిదర్శనం అన్నారు. సేవా కార్యక్రమాలు కూడా రాజకీయ రంగు దాల్చుతున్నాయనే చర్చలు ప్రజల్లో వినిపిస్తున్నాయి.

# పార్టీ కోసంకష్టపడి పనిచేసే వారికి అండగా ఉంటాం

### ప్రజల్లోకి వైసీపీ భూ అక్రమాలు, అరాచకాలు... టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్ మోహన్ రాజు

**రాజంపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తెలుగుదేశం కార్యకర్తల పార్టీ అని,పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని,కార్యకర్తల సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు కోరారు.శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమీక్ష సమావేశాన్ని చమర్తి నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో భూ అక్రమాలను అరాచకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అంతేకాకుండా రాబోయే రోజుల్లో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని కోరారు.అదేవిధంగా క్షేత్రస్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని గుర్తు చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్**

ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నియోజకవర్గ పార్టీ కార్యాలయం లో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలపై నేరుగా చమర్తి వినుతులు స్వీకరించారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ అభివృద్ధి,సంక్షేమాలను రెండు కళ్ళుగా భావించి సమన్వయంతో చంద్రబాబు నాయకత్వంలో కూటమి పాలన సాగిస్తోందన్నారు. అంతకుముందు భూ సమస్యలు,వీటితో పాటు పట్టణ , గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు,సామాజిక పెన్షన్లు,ఇండ్ల స్థలాలు,తాగునీటి ఇబ్బందులు తదితర అంశాలపై వినతులు అందాయన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బ నరసయ్య నాయుడు,పట్టణ అధ్యక్షులు దగ్గుపాటి సుబ్రహ్మణ్యం నాయుడు,మన్నూరు సొసైటీ చైర్మన్ ముళ్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు,పోలి చెరువు సంఘం అధ్యక్షులు నాగినేని నాగేశ్వర నాయుడు, మండల అధ్యక్షులు రవికుమార్ నాయుడు,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బారాజు, తదితర పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

# కాలీయ మర్దన అలంకారంలో కోదండరాముని వైభవం

### అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**ఒంటిమిట్ట ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

రెండవ అయోధ్య ఆంధ్ర భద్రాచలంగా కీర్తి గడించిన ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం ఉదయం టీటీడీ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా ఖాళీయ మర్దన అలంకారంలో జగదభిరాముని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. శ్రీ రామ ఉత్సవ వరును అర్చకులు నూతన వస్త్రాలతో, వివిధ రకాల ఆభరణాలతో పుష్పాలతో విశేషంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను గావించి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలే కాకుండా పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలో పాల్గొన్నారు. భక్తజన రంజకంగా ఏకశిలానగరం ఒంటిమిట్ట పుర వీధుల గుండా ఖాళీయ మర్దన అలంకారంలో శ్రీ కోదండ రామస్వామి నానాలంకరణ శోభితుడై పల్లకిని అధిష్టించి ఉత్సవంలో పాల్గొన్న భక్తులను ,పుర ప్రజలను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు నీరాజనాలు అందించారు. రామ నామ సంకీర్తనల, కేరళ వాయిద్యాల మహిళల సాంస్కృతిక కార్యక్రమాల కోలాటాల నడుమ భక్తిరస మాధుర్యంగా సాగింది.. ఈ వేడుకలో, ఆలయ డిప్యూటీవో ప్రశాంతి, ఇన్స్పెక్టర్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.









### రాజధాని చట్టబద్ధతపై టిడిపి శ్రేణులు సంబరాలు..



**యర్రగుంట్ల ఏప్రిల్ 2 ప్రభాతవార్త:**

రాజధాని అమరావతి పార్లమెంటులో చట్టబద్ధత చేయడంపై టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం యర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలి నుండి కడప రోడ్డులో గల టిడిపి పార్టీ కార్యాలయం వరకు ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ జై అమరావతి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి మండల ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రుల రాజధాని అమరావతిని పార్లమెంట్ నందు చట్టబద్ధత కనిపిస్తూ తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పులివెందుల రైతుల

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి హామీ

### మంత్రితో చరవాణిలో మాట్లాడిన బీటెక్ రవి

**పులివెందుల,ఏప్రిల్ 3 , ప్రభాతవార్త :**

పులివెందుల నియోజకవ ర్గంలోని రైతులు ఎదుర్కొం టున్న విద్యుత్ సమస్యలపై వేగంగా స్పందిస్తూ నియోజక వర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో చరవాణిలో చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పులివెందుల ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు అరటి పంట వైపు మొగ్గు చూపుతున్నారని, దాంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. అయితే విద్యుత్ పరికరాల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సకాలంలో సరైన విద్యుత్ సరఫరా అందిస్తే పంటలు బాగా పండుతా యని, రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారని ఆయన పేర్కొన్నారు.అదేవిధంగా పులివెందుల నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మంత్రి ని కోరారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి గొట్టిపాటి రవి సమస్యను అత్యంత ప్రాధాన్యంతో తీసుకుంటా మని హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, అవసరమైన విద్యుత్ పరికరాలను వెంటనే కొనుగోలు చేసి సరఫరా మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే స్థానిక నాయకులు కూడా అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి సహకరించాలని సూచించా రు.ఈ పరిణామంపై రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన బీటెక్ రవికు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే విద్యుత్ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చరవాణి ద్వారా మంత్రికి సమస్యలు వివరిస్తున్న బీటెక్ రవి

## బార్, రెస్టారెంట్లు ఆకస్మిక తనిఖీ



**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**

ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ నేపథ్యంలో ప్రొద్దుటూరు వన్‌టౌన్ పరిధిలోని మందార్ మరియు బీజీఆర్ బార్ అండ్ రెస్టారెంట్, లాడ్జీలను వన్‌టౌన్ సీఐ కొండారెడ్డి, ఎస్సై శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీ చేసి అనుమానాస్పదంగా ఉన్న వారిని విచారించడం జరిగింది.



# 3వ రోజుకు చేరిన ఆమరణ నిరాహార దీక్ష

### దీక్షకు సంపూర్ణ మద్దతు తెలిపిన వివిధ పార్టీలు ప్రజాసంఘాలు

ప్రొద్దుటూరు ఏప్రిల్ 3 ప్రభాతవార్త




ప్రొద్దుటూరు మున్సిపల్ టౌన్ ప్లానింగ్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు విధుల్లోకి తీసుకోవాలని గత మూడు రోజులుగా చేస్తున్న వెంకటేశ్వర్లు ఆమరణ నిరాహార దీక్షకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ అహ్మద్ ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లయ్య మాదిగ ఏపీ ఎంఎస్ఆర్‌యు సెక్రెటరీ రామలింగారెడ్డి నరసింహారెడ్డి రెడ్డయ్య కృష్ణ సుమంత్ మరియు ప్రజా సంఘాలు కుల సంఘాలు తమ సంపూర్ణ మద్దతు తెలిపాయి. శుక్రవారం వెంకటేశ్వర్లు ఆమరణ నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి వారు సంపూర్ణ మద్దతు తెలిపారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కార్మికులు ప్రాణాలను బలంగా పెట్టి మూడు రోజుల నుండి ఆమరణ దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. తనపై అధికారి ఆదేశాల ప్రకారం బాధితుడు పనిచేస్తే ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. చిన్న కార్మికుడికి ఇంత అన్యాయం జరుగుతుంటే స్థానిక శాసనసభ్యులు నంద్యాల వరదరాజు రెడ్డి స్పందించకపోవడం పై ఆయన అభ్యంతర వ్యక్తం చేశారు ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి జిల్లా కలెక్టర్ తో మాట్లాడి బాధితుడిని తిరిగి విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు ఈ సందర్భంగా బాధితులు న్యాయం జరిగేంతవరకు మద్దతుగా నిలబడి పోరాడుతామని తెలిపారు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్లయ్య మాదిగ మాట్లాడుతూ చిన్న ఉద్యోగస్తులపై ఏ తప్పు లేకున్నా విధుల నుంచి తొలగించడం అన్యాయమని తెలిపారు. ఈ ఈ విషయంపై వాస్తవాలు తెలుసుకొని జిల్లా కలెక్టర్ స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు మరియు నాయకులు గంగాధర్ రెడ్డి భాస్కర్ శివప్రసాద్ వెంకటేష్ సుబ్బయ్య సురేష్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు వారికి మద్దతుగా సిఐటియు ప్రధాన కార్యదర్శి కొర్రపాటి సత్యం ఇంజనీరింగ్ సెక్షన్ గౌరవాధ్యక్షులు బి విజయ్ కుమార్ శానిటేషన్ వర్కర్స్ నాయకులు సాల్మన్ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు త్యాగం మానవాళికి నిత్య జీవం



ప్రొద్దుటూరు ఏప్రిల్ 3 ప్రభాతవార్త

ఏసుక్రీస్తు త్యాగం సమస్త మానవాళికి నిత్యజీవం రక్షణ లభించింది అని రెవరెండ్ కోలాటి రాజు పేర్కొన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా గోకుల్ నగర్‌లోని ఎస్పీజీ క్రైస్ట్ చర్చ్ 2లో ఆయన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ ఫ్రైడే యొక్క విశిష్టతను ఏసుక్రీస్తు త్యాగాన్ని ఆయన భక్తులకు వివరించారు ఏసుక్రీస్తు త్యాగాన్ని మన్నించు తాను ప్రత్యేక దినం అని ఆయన ప్రేమ క్షమా దయను గుర్తు చేసుకునే రోజు గుడ్ ఫ్రైడే అని పేర్కొన్నారు. చెడును అధిగమించి ప్రేమను మాత్రమే అందరికీ గుర్తు చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉపవాస ప్రార్థనలో పాల్గొన్న భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

నందలూరు, ఏప్రిల్ 03 ప్రభాతవార్త :

మండలంలోని అరవపల్లిలో దక్షిణాంధ్ర లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. బ్రదర్ జి. కృపానందం ప్రసంగిస్తూ, మానవాళిని పాపపు స్థితి నుండి రక్షించేందుకు యేసు క్రీస్తు ఈ లోకానికి వచ్చారని తెలిపారు. ఆయన సిలువపై చేసిన బలిదానంతో మానవులకు విముక్తి లభించిందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు యేసు క్రీస్తు సిలువపై పలికిన ఏడు చివరి మాటలను విశ్వాసులు విశదీకరించారు. కార్యక్రమం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ ప్రార్థనల్లో సంఘ సభ్యులు హెచ్. ఆనంద్ కుమార్, సుందర్ రాజు గోపాల్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## బార్ నేతలకు మైనారిటీ ప్రతినిధుల సత్కారం



నందలూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

మండలంలోని బార్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ అలీ, కార్యదర్శి నాయనపల్లి అనుదీప్ జయసింహులను షేక్ నవాబ్ జాన్ ఆధ్వర్యంలో మైనారిటీ ప్రతినిధులు నాగిరెడ్డిపల్లి జామియా మసీదులో సత్కరించారు. కార్యక్రమంలో బషీర్ అహ్మద్, షాకీర్, ఫైజుల్లా ఖాన్ లోడి, షకీల్, సైఫుల్లా, మహబూబ్ బాషా, ఇబ్రహీం, షఫీ, హాజీ భాష పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు న్యాయ, సామాజిక సేవలు అందిస్తామని తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



ముద్దనూరు, ఏప్రిల్ 03 ప్రభాతవార్త:

గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఉన్న అన్ని చర్చిల్లో క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సిఎస్ఐ,ఆర్సిఎం,హెబ్రోన్,మన్నా చర్చిల పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిఎల్ ఎమ్ కాంపౌండ్‌లోని సిఎస్ఐ చర్చిలో రెవరెండ్ జె.డ్యానియెల్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్య ప్రసంగీకులుగా తాడేపల్లి గూడెం చెందిన పాస్టర్ పాల్ శ్రీధర్ ఏసు ప్రభువు శిలువపై పలికిన మాటల గురించి భక్తులకు భోదించారు. గుడ్ ఫ్రైడే యొక్క ప్రాముఖ్యాన్ని క్రైస్తవులకు తెలియజేశారు. అనంతరం ఎల్ ఎమ్ కాంపౌండ్ లోని సిఎస్ఐ చర్చి వద్ద ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఆర్ సిఎం చర్చి ఫాదర్ మరిరెడ్డి గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యత తెలిసేలా ఏసుక్రీస్తు శిలువ యాగం చేసే కార్యక్రమాన్ని చిన్నారులుపలు రకాల వేషధారణలతో పాత బస్టాండ్ వరకు శిలువ యాగం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘపెద్దలు, సంఘస్తులు, ఎల్ఎమ్‌సియూత్, మహిళలు, చిన్నారులు, సిస్టర్లు పాల్గొన్నారు.

### శాసనమండలి చైర్మన్ షరీఫ్‌పై

# వైసిపి దాష్టీకం దారుణం

### టిడిపి మైనార్టీనేత గుల్జార్ భాష

రాజంపేట, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అమరావతి రాజధానికి వ్యతిరేకంగా శాసనమండలిలో నిర్ణయం తీసుకోవాలని అప్పటి చైర్మన్ షరీఫ్ పై వైసీపీ దారుణంగా ప్రవర్తించడం శోచనీయమని టిడిపి మైనార్టీ నేత ,మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ గండికోట గుల్జార్ భాష ఒకప్రకటనలో ధ్వజమెత్తారు. రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక మైనార్టీ నేతను రాజ్యాంగ సభలోనే బెదిరించడం, దాడులు చేయడం నీతిమాలిన చర్య అన్నారు. వైసిపి అహంకారానికి ఇది దర్పణం పడుతుందన్నారు. షరీఫ్‌ని దూషించడము, కొట్టడము ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ దురహంకారం మానుకోవాలన్నారు. మైనార్టీలపై ఈ రకమైన దాడులను రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తినే మీరు వదల్లేదంటే సాదా సీదా మైనార్టీలకు మీరు ఏ విధంగా మర్యాదిస్తారో ప్రజలకు ఆలస్యంగానే అయినా తెలిసిందని పేర్కొన్నారు.

## ఉపాధి కూలీల ముఖ ఆధారిత హాజరుపై అవగాహన

ముద్దనూరు, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామపంచాయతీ ప్రజలు నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథక పని ప్రదేశాన్ని శుక్రవారం ఏపీవో గంగయ్య పరిశీలించి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ముక్కా ఆధారిత హాజరు ఈ కేవైసీ పై పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో ఎండ వేడి నుంచి రక్షించుకోవడానికి తగినన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది కూలీలు పాల్గొన్నారు.



## మల్లా రెడ్డికి సంతాపం



పులివెందుల, ఏప్రిల్ 3 , ప్రభాతవార్త :

పులివెందుల మండలం ఆర్.తుమ్మలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి మరియు తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ బోర్డు చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మల్లారెడ్డి పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నిబద్ధత కలిగిన నాయకుడని కొనియాడారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కోరారు. మల్లారెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.

## అక్రమ రేషన్ దందాపై ఉక్కు పాదం

సిద్ధవటం ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అక్రమంగా రేషన్ తరలింపు చేస్తే కఠినమైన చర్యలు తప్పవని ఎస్సై హారిక హెచ్చరించారు ఈ సందర్భంగా మండల కేంద్రమైన సిద్ధవటం పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఎస్సై హారిక మాట్లాడుతూ పల్లె ప్రాంతాల్లో రేషన్ కొనుగోలు చేసి తరలింపు చేస్తున్న దందాపై ఉక్కు పాదం మోపుతామని కొంతమంది పై నిఘా వేసి ఉంచామని ఎవరైనా పల్లె ప్రాంతాలలో పిడిఎఫ్ రైసు కొనుగోలు చేస్తే సమాచారం తెలపాలని మండల ప్రజలకు తెలిపారు కోడి పందేళ్లు, జూదం అక్రమ రేషన్ తరలింపు, చేస్తున్న వ్యక్తులపై సమాచారం తెలిస్తే 9121100581,9121100584, మొబైల్ నెంబర్లకు తెలపాలని సమాచారం తెలిపిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై హారిక తెలిపారు.

### స్మశాన వాటికలు నిర్మించి

## ఆదర్శంగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం



మైదుకూరు, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:

మైదుకూరు మండలంలోని వనిపెంట గ్రామపంచాయతిలో స్మశాన వాటిక ప్రారంభోత్సవములో శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం వనిపెంట టిడిపి నాయకులు ఇస్మాయిల్ మాట్లాడుతూ మా నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో ఒక బృహత్తర కార్యక్రమాన్ని అంకుటిత దీక్షతో ప్రతి గ్రామానికి స్మశాన వాటిక ప్రజల సౌకర్యాల నిమిత్తం అన్ని వసతులతో నిర్మించాలని ఉద్దేశంతో వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులో తేవడం జరుగుతుంది.గతంలో ఎన్నో ప్రభుత్వాలు చూసాం కాని ఒకేసారి ఇన్ని గ్రామాలలో స్మశాన వాటికలు నిర్మించాలని ఉద్దేశం ఎవరికీ ఈ ఆలోచన రాకపోవడం ప్రజల అవసరాలను గుర్తించకపోవడం అభివృద్ధిని అంటే ఏంటో ప్రజలు తెలుసుకోవాలి. గ్రామాలలో పరిపాలన, అభివృద్ధి, ప్రజా సంక్షేమం తెలుగుదేశం హయాంలో చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.వి శ్రీధర్ నాయుడు, మండల టిడిపి ఇన్చార్జి భీమయ్య, వనిపెంట టిడిపి నాయకులు ఇస్మాయిల్ వివిధ గ్రామ పంచాయతిల నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులు, వనిపెంట గ్రామ ప్రజలు ఉపాధి ఏపిఓ రామచంద్రారెడ్డి జెఈ ప్రతాప్, టెక్నికల్ అసిస్టెంట్ విశ్వనాథరెడ్డి, సురేష్, రమేష్, భైరవ, కొండారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగినది.

## గ్రామ పంచాయతిలకు ప్రత్యేక అధికారులు

మైదుకూరు, ఏప్రిల్ 03, ప్రభాతవార్త:

మండలంలోని గ్రామ సర్పంచ్‌ల పదవి కాలం ముగియడంతో పంచాయతిలకు స్పెషల్ ఆఫీసర్స్‌ను నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఇక గ్రామాలలో పంచాయతీ ఎన్నికల వరకు ప్రత్యేక అధికారులచే పరిపాలన కొనసాగిస్తారు. మైదుకూరు మండలంలోని నంద్యాలంపేట, వనిపెంట, గంజికుంట, విశ్వనాధపురం, ఎన్ ఎర్రబెల్లి, తువ్వపల్లి, మిట్టమానుపల్లి, ఆదిరెడ్డిపల్లి, అన్నలూరు, పప్పన పల్లి, తిప్పిరెడ్డిపల్లి, శివపురం, దయంఖాన్ పల్లి పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించినట్లు ఎంపీడీవో శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

## చెంచులక్ష్మి ఎస్టీ కాలనీలో సంబరాలు

### మార్కెట్ కమిటీ డైరెక్టర్ పదవిపై ఆనందం



సిద్ధవటం ఏప్రిల్ 3 ప్రభాతవార్త

చెంచులక్ష్మి ఎస్టీ కాలనీలో నివాసమున్న బయన్నకు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో డైరెక్టర్‌గా చోటు లభించడంపై కాలనీ వాసులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బయన్న మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ సహకారంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ లో డైరెక్టర్ గా నియామకం చేపట్టడం పట్ల మా కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎన్నడు మా కాలనీలో పదవులు ఏ పార్టీ మాకు ఇవ్వలేదని రాష్ట్రంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం పేద బలహీన వర్గాల కుటుంబాలకు సముచిత న్యాయం జరిగే విధంగా పదవులు కట్టబెట్టడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణకు జనసేన మండల కన్వీనర్ మహబూబ్ బాషా కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని రాబోయే స్థానిక ఎలక్షన్లో కూటమి పార్టీకి పట్టం కడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెంచులక్ష్మి కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

చాపాడు. ఏప్రిల్3 ప్రభాతవార్త :

గ్రామపంచాయతీ సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ఆయా గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. చియ్యపాడు, వెదురూరు, ఎన్‌ఓబాయపల్లి గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో మధుసూదన్, లక్ష్మీపేట, సోమాపురం, మడూరు గ్రామాలకు తహసీల్దార్ రమాకుమారి, పల్లవోలు, బద్రిపల్లె, పెద్దగురువలూరు గ్రామపంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో, హరినాథ్ అల్లాడుపల్లి, చాపాడు, చిన్నగురువలూరు, ఖాదర్ పల్లె, గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో రత్నరాజ్ ( గ్రామ వార్డు సచివాలయ వార్డు ). అదేవిధంగా అన్నవరం, అయ్యవారిపల్లి విశ్వనాధపురం గ్రామ పంచాయతీలకు ఎంఈఓ 1 రవిశంకర్, నాగులపల్లె సిద్ధారెడ్డిపల్లె, సీతారామపురం గ్రామాలకు ఎంఈఓ 2 వంశీకృష్ణ, తప్పెటఓబాయపల్లె, రాజువారిపేట, కుచ్చుపాప గ్రామాలకు మండల వ్యవసాయ అధికారిని దేవిపద్మలతలను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చైర్మన్



కలసపాడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

మండలంలోని శంకవరంలో శుక్రవారం జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తెదేపా కార్యకర్త ఉద్దండం మహేష్ కుటుంబాన్ని పరామర్శించారు. మహేష్ భార్య ఉద్దండం సింధుజా (22) కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థిక సమస్యలతో తల్లడిల్లుతుండటంతో త్వరలో ఆమెకు తన వంతు ఆర్థిక సాయం అందించడంతో పాటు పార్టీ పరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. అనంతరం లింగారెడ్డిపల్లెలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన వెంట తెదేపా నాయకులు దుగ్గిరెడ్డి, బాలిరెడ్డి, చెరుకూరి రవికుమార్, ప్రహ్లాదరెడ్డి, బాల అంకిరెడ్డి, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్లు నియామకం

కలసపాడు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

మండలంలోని 13 పంచాయితీలో స్పెషల్ ఆఫీసర్లను నియమించారని మండల ఎంపీడీవో మహ బూబ్ బి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కలసపాడుకు స్థానిక ఎంపీడీవోను ఈ రామాపురంకు మండల్ తహసీల్దార్ రవీంద్రారెడ్డిని మహానంది పల్లెకు డిప్యూటీ ఎంపీడీవోలు, అలాగే అన్ని పంచాయతీలకు వేశారని, ఏమైనా సమస్య ఉంటే స్పెషల్ ఆఫీసర్లను చెప్పాలని తెలిపారు. అంతేకాకుండా స్పెషల్ ఆఫీసర్లకు తెలపని యెడల మండల ఎంపీడీవోకు తెలిపిన సమస్యను పరిష్కారం చేస్తామన్నారు.

### కేజీ బేసిన్ గ్యాస్‌లో

## 50శాతం రాష్ట్రానికే కేటాయించాలి




బద్వేలు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త

కృష్ణ-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజ వాయువులో కనీసం 50 శాతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవసరాలకు కేటాయించాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం భగత్ సింగ్ నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌ను రిలయన్స్ కంపెనీ పైప్‌లైన్ ద్వారా మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు తరలించడం వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో గ్యాస్ కొరత ఉండగా, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేయడం అన్యాయమని విమర్శించారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం భారీ స్థాయిలో సహజ వాయువు ఉత్పత్తి జరుగుతున్నప్పటికీ, రాష్ట్రానికి తగిన వాటా లభించడం లేదన్నారు. వంట గ్యాస్ వినియోగదారులు, పరిశ్రమలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి కేజీ బేసిన్ గ్యాస్‌లో 50 శాతం వాటాను రాష్ట్రానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే రాష్ట్ర ప్రయోజనాల కోసం పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదల వ్యతిరేక ప్రభుత్వం టిడిపి




కడప కార్పొరేషన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం జగనన్న ఇళ్ల నిర్మాణమని వైసిపి యువజన విభాగం కడప జిల్లా అధ్యక్షులు దేవిరెడ్డి ఆదిత్య అన్నారు. ఈ పథకం కింద 30.70 లక్షలకు పైగా ఇళ్ల పట్టాల పంపిణీ జరగగా, లబ్ధిదారులకు నివాసయోగ్యమైన ఇళ్లను నిర్మించి, మౌలిక సదుపాయాలతో కూడిన కాలనీలను (జగనన్న కాలనీలు) ఏర్పాటు చేశారన్నారు. శుక్రవారం కడప వైసీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదిత్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1.10 కోట్ల ఇల్లు నిర్మిస్తే.. వైయస్సార్ హయాంలో ఉమ్మడి ఏపీలో 50 లక్షల గృహాలు నిర్మించారన్నారు. 201419లో బాబు హయాంలో కేవలం 77వేల ఇల్లు నిర్మించారనీ ఎద్దేవ చేశారు. టిడిపి పాలనలో టిడ్కో ఇళ్లల నిర్మాణంలో అవినీతి చోటుచేసుకుందని, కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు పేదల వ్యతిరేకంగా మారారన్నారు. ప్రజలే బుద్ది చెప్తారనన్నారు. 201924 లో జగనన్న కాలనీలో నిర్మించి అన్ని రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేశారని, ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు అందించిందని చెప్పారు. 21 లక్షల గృహాల నిర్మాణాల హామీని టిడిపి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శివారెడ్డి, రహమతుల్లా ఖాన్, ఫయాజ్ అహ్మద్, విష్ణువర్ధన్ రెడ్డి, అదీప్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగుల పెండింగ్ బకాయిల విడుదలపై హర్షం




కడప కార్పొరేషన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

రూ.7,000 కోట్లకు పైగా బకాయిల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడం ఉద్యోగులకు ఎంతో ఊరటనిచ్చే సానుకూల చర్య అని ఏపీ ఎన్జీవో కడప జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కడప ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశంలో బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రూ. 1,847.83 కోట్లు జనరల్ ప్రావిడెంట్ ఫండ్, రూ.3,411.03 కోట్లు గ్రాట్యుటీ బకాయిలు, రూ.1,800 కోట్లు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల లీవ్ ఎన్ క్యాష్‌మెంట్, రూ. 223.47 కోట్లు, పోలీసు సిబ్బందికి అదనపు సరెండర్ లీవ్ చెల్లింపులు ఉన్నాయన్నారు. జి పి ఎఫ్ కింద రూ.1,847.83 కోట్లు, గ్రూప్ ఇన్సూరెన్స్ ఇప్పటికే విడుదల చేసినట్లు తెలిపారు. ఇందుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో జిల్లా సెక్రటరీ నిత్యపూజయ్య, సహా అధ్యక్షులు తిమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు సిద్దయ్య, జాయిన్ సెక్రటరీలు రాజశేఖర్, పద్మనాబయ్య, శ్రీనివాసులు, సిటీ సెక్రటరీ సాంబశివరావు, జాయిన్ సెక్రటరీ నవీన్‌ఆచారీ, వెంకటసుబ్బయ్య, నరేష్, పాల్గొన్నారు.

### రాజయోగం, ధ్యానం ద్వారా

## మానసిక బలాన్ని పెంపొందించాలి




పులివెందుల, ఏప్రిల్ 3, ప్రభాతవార్త :

దివ్యాంగులు దైవసమా నులని, వారికి గౌరవప్రదమైన జీవితం కల్పించడం సమాజ బాధ్యత అని ఓంశాంతి పులివెందుల శాఖ నిర్వాహకురాలు సిస్టర్ రాధిక పేర్కొన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం (ఓంశాంతి సంస్థ) ఆధ్వర్యంలో దివ్యాంగుల కోసం నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కమ్యూనిటీ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిస్టర్ రాధిక మాట్లాడుతూ, శివబాబా దృష్టిలో దివ్యాంగులు అత్యంత ఇష్టమైన వారన్నారు. వైకల్యంతో బాధపడుతూ మానసిక ఆందోళనలకు గురయ్యే వారికి రాజయోగం, ధ్యానం ఉత్తమ పరిష్కారమని సూచించారు. ప్రతిరోజు ధ్యానం చేయడం ద్వారా శారీరక, మానసిక సమస్యలను అధిగమించి ఆరోగ్యవం తమైన జీవితం గడపవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓంశాంతి సంస్థ సేవకులు దివ్యాంగులకు రాజయోగం, ధ్యానం చేయించి స్వస్థత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంస్థ తరపున 30 మంది దివ్యాంగులకు బ్యాగులు, స్వీట్లు పంపిణీ చేశారు.వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి మాట్లాడుతూ, దివ్యాంగులకు సహాయం అందించిన ఓంశాంతి సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓంశాంతి సంస్థ నిర్వాహకులు సిస్టర్ రాధిక, సిస్టర్ రాజేశ్వరి, విశ్రాంత ఎంఈఓ శంభురెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ సభ్యులు గంగనపల్లి హరికృష్ణ పాల్గొన్నారు.

### పెన్నానది వరదలకు

## కోతకు గురి అవుతున్న పొలాలను కాపాడండి

సిద్ధవటం ఏప్రిల్ 3 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజంపేట ఇన్‌చార్జ్ జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి టక్కోలి, కడపయపల్లి, లింగంపల్లి గ్రామాలకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పెన్నా నది ఒడ్డున ఉన్న ఈ గ్రామాల పరిసరాల్లోని విలువైన వ్యవసాయ భూములు పెన్నానది వరదల కారణంగా తీవ్రంగా కోతకు గురవుతున్నాయని వివరించారు. రైతులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారని తెలియజేశారు వెంటనే తగిన నిధులు మంజూరు చేసి, పెన్నా నది తీర ప్రాంతంలో ప్రొటెక్షన్ వాల్ (రక్షణ గోడ) నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి వినతిపత్రం అందజేశారు. రైతుల జీవనాధారాన్ని కాపాడటానికి ఇది ప్రొటెక్షన్ వాల్ అత్యవసరమని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, భూముల సంరక్షణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నాగమునిరెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్ పాల్గొన్నారు.

# బేతనియ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు..

సుండుపల్లె, ఏప్రిల్ 03,ప్రభాతవార్త :

మండల పరిధిలోని బేతనియ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని బ్రదర్ విజయ కుమార్ తెలియజేసాడు.రాయచోటి నుంచి వచ్చిన బ్రదర్ రత్నం గుడ్ ఫ్రైడే సందేశం ఇస్తూ ఈ మంచి శుక్రవారం మానవ జీవితాలకు ఎంతో ప్రాముఖ్యమైన దినమని మన పాపములను తనపై వేసుకొని క్రీస్తువారు సిలువలో ప్రాణత్యాగం చేశారని కనుక ప్రజలందరు యేసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలనియు,యేసుక్రీస్తు సిలువలో కార్చిన రక్తం సకల మానవాళి పాపాలను తుడుచి వేస్తుందని తెలియజేసారు.కావున ఏసుక్రీస్తు మార్గములైన శాంతి మార్గం అనుసరించి ప్రపంచమంతా సుఖశాంతులతో ఉండాలని కోరారు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలందరూ బేతనియ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు అందరూ కలిసి నిర్వహించడం జరిగింది



## బీసీ ధర్మదీక్షకు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు




మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త.

బీసీల హక్కుల సాధన కోసం భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఏప్రిల్ 11 నుండి చేపట్టనున్న బీసీ ధర్మదీక్ష కు రాష్ట్రవ్యాప్తంగా మద్దతు లభిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పాల రమేష్ యాదవ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మదనపల్లె ప్రెస్ క్లబ్‌లో బీసి ధర్మదీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టే బీసి ధర్మదీక్ష చారిత్రాత్మక ఉద్యమంగా నిలవనుందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బీసీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్నమయ్య జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, బీసీ సోదరులు, యువత ఈ ధర్మదీక్షకు మద్దతుగా ముందుకొచ్చి బీసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం కథం తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సెక్రటరీ సాంబమూర్తి, హరిబాబు యాదవ్, గిరిబాబు, వెంకటేష్, శంకర్, జ్ఞానేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## డిజైన్ కట్టర్ మీదపడి కార్పెంటర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త.

కొయ్యకు డిజైన్ చేస్తుండగా కట్టర్ పొరపాటున కడుపు మీద పడడంతో కార్పెంటర్ గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుని కథనం మేరకు.. పట్టణంలోని బుగ్గకాలువ కు చెందిన చోటు కార్పెంటర్ గా పనిచేస్తూ జీవనం చేస్తున్నాడు. కొయ్యలను కత్తిరించే క్రమంలో ప్రమాదవశాత్తు కట్టర్ కడుపు మీదపడడంతో కడుపు కు బలమైన గాయం అయ్యి తీవ్రరక్తస్రావం అయ్యింది. బాధితున్ని వెంటనే జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. బి.కొత్తకోట కు చెందిన వెంకటరమణ ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. ఆటో మరమ్మత్తు కు స్పేర్ పార్ట్స్ అవసరం కావడంతో ద్విచక్రవాహనంలో మదనపల్లి కి వచ్చాడు. సిటిఎం రోడ్డులో మరో ద్విచక్రవాహనం ఢీకొనంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణి



మదనపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

బెంగుళూరురోడ్డులోని ఆల్‌స్మైల్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థులకు తంబళ్లపల్లె మల్లయ్యకొండ మాజీ ఛైర్మెన్, రెడ్లసంఘం అధ్యక్షులు కనగొండ మద్దిరెడ్డి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. శుక్రవారం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యాను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. స్కూల్ నిర్వహన పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. పాఠ్యపుస్తకాలతో పాటు విద్యాసామాగ్రిని ఆయన అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి, బివైఎస్ నాయకులు పునీత్, రెడ్లసంఘం నాయకులు రామ్మోహన్‌రెడ్డి, చిప్పిలి క్రిష్ణారెడ్డి, ప్రభాకర్, గోపినాథ్, నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలకు మంత్రి మండిపల్లికి ఆహ్వానం



రాయచోటి ఏప్రిల్ 3 ప్రభాతవార్త

ఏపీపీటిడీ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డిని ఆహ్వానించి నట్లు యూనియన్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న ఒంగోలు లో 28వ రాష్ట్ర మహాసభ జరుగుచున్నదని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల భాగస్వామ్యంతో మహాసభలను విజయవంతంగా నిర్వహించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయాని. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న మంత్రి మహాసభలకు హాజరై ఉద్యోగులకు మార్గని ర్దేశనం చేయాలని యూనియన్ నాయకులు మంత్రిని కోరినట్లు వారు వివరిం చారు. అందులకు మంత్రి మండిపల్లి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

## గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారాలు నియామకం



రామసముద్రం ఏప్రిల్ 3 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వార్డు సభ్యుల 5 ఏళ్ల పదవీకాలం 2026 ముగియండంతో గ్రామాల్లో పరిపాలన కొనసాగించడానికి ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఎన్నికలు వాయిదా పడటంతో తాహసీల్దార్, ఎంపిడిఓ ఇతర గెజిటెడ్ అధికారులను పంచాయితీల ఇంచార్జ్‌లుగా నియమించారు. తాహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్ చరవాణి ద్వారా తెలిపిన వివరాలు మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. పెద్దకుర ప్పల్లె, చొక్కాండ్ల పల్లె, అరికల గ్రామ పంచాయతీలకు తాహసీల్దార్ మహ్మద్ అజారుద్దీన్, ఆర్ నడింపల్లె, కేసీ పల్లె, మూగవాడి, కమ్మవారి పల్లె గ్రామపంచాయతీలకు ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, కాప్పల్లె, చెంబకూరు, మాలేనత్తం గ్రామం కు డిప్యూటీ ఎంపిడిఓ కృష్ణవేణి, రామసముద్రం, ఊలపాడు, నారిగానిపల్లె, కురిజల, మనేవారిపల్లె, కురిజల గ్రామపంచాయతీకి వ్యవసాయాధికారి జాఫర్, ఎలావానెల్లూరు, మినికి ఎంఈవో హేమలత, ఎలకపల్లె రాగిమాకులపల్లె గ్రామ పంచాయతీకి ఎంఈఓ 2 ఆంజనేయులు పంచాయతీ అధికారులుగా విధులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

# అమరావతి దేవతల రాజధాని : ఎమ్మెల్యేలు

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 3 ప్రభాతవార్త

అమరావతి దేవతల రాజధాని అని పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, పులివర్తి నానిలు అన్నారు. శుక్రవారం శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మను వారిద్దరూ దర్శించుకొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రులకు కల అయిన అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తూ లోక్‌సభలో బిల్లు పాసు చేయడం ముక్కోటి దేవతల ఆశీర్వాదమన్నారు. ప్రధాని నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌నాయుడులు అమరావతిని రాజధాని చేయడంలో సఫలీకృతులయ్యారన్నారు. ఆంధ్రుల విజయంగా అభివర్ణించారు. తతాస్తు దేవతల ఫలితంగా అదే రోజు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టడం, మావిగన్ అని తెలిపారనీ, అయితే మావిగన్ కాదు ఉన్న 11ఎమ్మెల్యే స్థానాలు మావిగావ్ అన్న అర్థం వస్తాయని ఎద్దేవా చేసారు. అమరావతి అనేది ప్రజల మనోభావాలతో ముడిపడిందన్నారు. దానికి జగన్ గ్రహణం పట్టిందన్నారు. అయితే అమరావతి మహిళల ఉద్యమంలో దేవస్థానం టు న్యాయస్థానం చేశారనీ, అప్పట్లో నారా భువనమ్మ వారికోసం గాజులిచ్చి మద్దత్తు పలికారన్నారు. దేవస్థానం నుంచి మొదలైంది కాబట్టి అమ్మవారి ఆశీస్సులతో అమరావతికి చట్టబద్ధత కల్పించారన్నారు. అనంతరం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. గంగాధర నెల్లూరు టిడిపి పరిశీలకుడు దేవనాథరెడ్డి, తిరపతి కార్పోరేషన్ మాజీ డిప్యూటీ ఛేర్మన్ మురళీనారాయణ, సింగిల్‌విండో ఛేర్మన్ హరిరాయల్, బోయకొండ సుబ్బు, సోము, పాలెంరెడ్డి, చంద్రబాబునాయుడు, కోయా గిరినాయుడు, కార్తీక్‌మురళి, విద్యాసాగర్, రామకృష్ణ, తేదేపా, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, ఆలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మరళీమోహన్

## అమ్మచెరువుమిట్టలో ఘనంగా అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట

### పూజలకు హాజరైన రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు



మదనపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట నందు శుక్రవారం శ్రీ మల్లికార్జున సమేత అక్కదేవతల విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈపూజా కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు ముఖ్య అతిధిగా హాజరై పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలన్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, నరసింహులు, శ్రీనివాసులు, గుండ్లపల్లి నాగరాజ, నాగయ్య, అమరనాథ్‌రెడ్డి, సింగ్, బిజెపి శ్రీకాంత్, భాను తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలియజేసిన ఏపీ ఎన్జీవో నాయకులు



లక్కిరెడ్డిపల్లి: ఏప్రిల్ 03 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లకు చాలా కాలంగా పెండింగ్లో ఉన్న బకాయిలను దాదాపు 7059 కోట్ల రూపాయలు విడుదలకు ఆమోదం తెలిపిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం నుండి డిమాండ్స్ ఒకటి సాగించడానికి ట్రై చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి బివి రమణ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దాదాపు గత ప్రభుత్వం నుంచి పెండింగ్లో ఉండిపోయిన 25 వేలు కోట్లకు పైబడి మొత్తాన్ని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్లకు తిరిగి చెల్లింపు చేసే కార్యక్రమంలో భాగంగా ఒక విడుదల 12 వేల కోట్లను మరొకసారి 1100 కోట్ల రూపాయలు విడుదల చేయడం రాకుండా ప్రస్తుతం మరొకసారి 7500 కోట్ల బకాయిలను చెల్లించేందుకు ముందుకు రావడానికి ఏపీ ఎన్జీవోస్ పక్షాన ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రభుత్వం ఉద్యోగులతో ఒక ఫ్రెండ్లీ ప్రభుత్వంగా కొనసాగుతూ దాన్ని నిజం చేస్తూ మిత్రులవారీగా పెండింగ్లో ఉన్నటువంటి బకాయిల మొత్తాన్ని వీలైనంత త్వరగా ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, లక్కిరెడ్డిపల్లి తాలూకా అధ్యక్షులు విశ్వనాథ్, తాలూకా కార్యదర్శి మహమ్మద్ అలీ, కోశాధికారి రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

## నల్లచిన్నేపల్లెలో ఉచిత వైద్య శిబిరం




రామసముద్రం మార్చి 3 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని కాప్పల్లె గ్రామపంచాయతీలోని నలచిన్నే పల్లె గ్రామంలో శ్రీ రామనవమి ఉత్సవాలు సందర్భంగా గ్రామంలో తయారు చేసిన ప్రసాదం తయారు చేసి ఆలయం వద్ద భక్తులకు పంపిణీ చేశారు. ప్రసాదం స్వీకరించిన తరువాత వి రేచనాలు, వాంతులు, టైఫాయిడ్ జ్వరాలు కావడంతో చెంబకూరు పిహెచ్‌సిలో 15 మందికి చికిత్స అందించారు. శుక్రవారం ఉదయం నల్లచిన్నేపల్లె గ్రామంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి 36 మంది చిన్న వ్యాధులకు చికిత్స అందించారు. చెంబకూరు పి హెచ్ సి డాక్టర్ లు జాహ్నవి, నాగరాజు వైద్య శిబిరం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మంచి నీరు, ఆహారం తీసుకోవాలని గ్రామ ప్రజలకు తెలియజేసారు. ఓఆర్ఎస్ ఫ్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొత్తం 36మంది, జ్వరం 5, వాంతులు 15మంది, పి హెచ్ సి లో 15, 8 మందికి ఐవి ఫ్లూడ్స్ పెట్టి పరీక్షలు చేశారు. వీరు చికిత్స తీసుకుని గ్రామాలకు వెళ్లారు. ఈ వైద్య శిబిరంలో టి. వి రమణ, ఏ ఎన్ ఎం కవిత సి హెచ్‌వో రెడ్డిలక్ష్మి ఆశాకార్యకర్తలు పద్మావతి, సుందరమ్మ, అనురాధ తదితరులు హాజరై చికిత్స అందించారు.

## పైగడ్డ గ్రామానికి బోరు మోటార్ మంజూరుతో గ్రామస్థులు ఆనందం



రామసముద్రం ఏప్రిల్ 3 ప్రభాతవార్త

రామసముద్రం మండలం ఎలవానెల్లూరు పంచాయతీ లోని పైగడ్డలో తాగునీటి కొరత నెలకొనడంతో గ్రామస్థులు ఎదో ర్కొన్నారు, గ్రామ ప్రజలు పంచాయతీ కార్యాలయా ల్లో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రెడ్డి ప్రసాద్ కు సమస్యను తెలియజేసారు. వెంటనే స్పందిస్తూ ఎంపిడిఓ లతీఫ్ ఖాన్ ద్రుష్టి కి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎంపిడిఓ కొత్త బోరు మోటార్ పంపును మంజూరు చేశారు. దీంతో గ్రామప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

## సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయండి



మదనపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

రాయచోటిలో ఈనెల 12న నిర్వహించే సిఐటియు జిల్లా రెండవ మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు తెలిపారు. శుక్రవారం మదనపల్లెలోని సిఐటియు కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.వెంకటరామయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహాసభ జయప్రదానికి సంబంధించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, లేబర్‌కోడ్స్ వంటి చట్టాలను వ్యతిరేకించడమే కాదు దేశవ్యాప్తంగా కార్మికులను, రైతులను సమీకరించి ఒకటి చేయడం కోసం సిఐటియు కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిధిలుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు హాజరవుతారన్నారు. జిల్లాలోని కార్మికులు ఈ సమావేశానికి హాజరు కావాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, హరిశర్మ, రాజేశ్వరి, జయమ్మ, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో పలుచర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు



రామసముద్రం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ను క్రైస్తవులు ఉపవాస ప్రార్థనలు, ఆరాధనలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వనగాని పల్లె, చెంబకూరు, దిన్నిమీదహరిజనవాడ గ్రామాల్లో గల బేతస్థ ప్రార్ధనా మందిరంలో పాస్టర్ జోసేఫ్ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉపవాస ప్రార్ధనలు, ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మానవులు చేసిన పాపాల విమోచన కొరకు కల్వరి సిల్వలో బలి యాగ మైనాడని తెలిపారు. క్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను గూర్చి సంఘసభ్యులకు తెలియజేశారు. జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రేమ, క్షమ, దయ వంటి గుణాలను ఆచరించాలన్నారు. అనంతరం సంఘ సభ్యులకు జ్యూస్‌లు అందజేశారు.

## తంబళ్లపల్లెలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



తంబళ్లపల్లె ఏప్రిల్ 3 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం లో శుక్రవారం క్రిస్టియన్ సోదరులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తంబళ్లపల్లె సి ఎస్ ఐ చర్చిలో పాస్టర్ రెవరెండ్ పాల్ రాజ్ ఆధ్వర్యంలో మదనపల్లి జెసీఎం చర్చి నుండి ఎల్ పి ఎఫ్ ఫెలో షిప్ సభ్యులు శ్రీమతి మేరీ మార్గరెట్, శోభమ్మ, రత్నవేణి, గీతమ్మలు ప్రత్యేక ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఈ దినం శుభ శుక్రవారం ఏసుక్రీస్తు ప్రభువు వారు శిలువ మాను పై పలికిన పవిత్రమైన ఏడు మాటలను రాణించడం జరిగింది. ఏసుక్రీస్తు శిలువ త్యాగాన్ని, దేవుని నిరూపమాన ప్రేమను స్మరించుకొనే పవిత్ర దినం గుడ్ ఫ్రైడే అని బోధించారు. మానవాళి పాప పరిహారం కోసం క్రీస్తు పడిన వేదనను, క్షమా గుణాన్ని ధ్యానిస్తూ ప్రేమ మరియు శాంతి మార్గంలో నడవాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వాదకరమైన గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోర్డు నరసింహులు, ఎల్ఐ భాస్కర్, కరెంట్ యోహాను, చంద్రమ్మ, సుజాత, దేవ శిఖామణి, చిట్టిబాబు, విమలమ్మ, వసంతమ్మ, శ్యామలమ్మ, సంఘస్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు.

## నేటి నుంచి గ్రామ పంచాయతీలకు అధికారుల పాలన

లక్కిరెడ్డిపల్లి: ఏప్రిల్ 03 ప్రభాతవార్త

నేటి నుంచి గ్రామ పంచాయతీలకు అధికారుల పాలన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రెడ్డెయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం బుధవారం 02042026తో ముగియనున్న నేపథ్యంలో, ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఎన్నికైన ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించే వరకు గ్రామపంచాయతీల పనులు సక్రమంగా సాగేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994లోని సెక్షన్ 143(3) ప్రకారం, జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ అధికారంతో ఈ నియామకాలు చేపట్టబడ్డాయని అన్నారు. గురువారం 03042026 నుండి ఈ ప్రత్యేక అధికారులు తమ బాధ్యతలు చేపట్టి, గ్రామపంచాయతీల పరిపాలన, సేవల నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించనున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన ఈ ఉత్తర్వులు నేటి అమల్లోకి వచ్చాయని అన్నారు.

## ముగిసిన అసర్ల గంగమ్మ జాతర



గాలివీడు.ఏప్రిల్.3, ప్రభాతవార్త

మండల కేంద్రంలో నీ కుశావతి నది తీరాన నడింపల్లి, బలిజ పల్లి మధ్య వెలసిన శ్రీ అసర్ల గంగమ్మ జాతర గురువారం ఉదయం సిద్ధల కూడు నైవేన్ద్యతో ప్రారంభమైన జాతర గురువారం రాత్రికి జాతరలో అంగరంగ వైభవంగా కోలాటాలు, ఆర్కే స్ట్రా, బాన సంచా, చాందినీ బండ్లు భక్తులకు కనువిందు కలిగించాయి. జాతరలో పెద్దగొడుగు స్వామి భక్తులకు దర్శనం కల్పించారు. శుక్రవారం ఉదయం గ్రామంలో నీ ముత్తైదు మహిళలు భక్తి శ్రద్ధలు తో చేసిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించి మొక్కలు తీర్చుకొన్నారు. శుక్రవారం సాయంత్రం కల్లి పాటు కార్యక్రమం తో జాతర ముగిసింది. జాతరకు వచ్చిన భక్తులకు గురువారం సార్ మా క్రాకర్స్ ఆధ్వర్యం లో అన్నదానం, శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కే. ఎల్. హెచ్. వైన్స్ ఆధ్వర్యం లో విందు భోజనం ఏర్పాటు చేశారు.

## జనసేన పార్టీ బలోపేతానికి కృషి

### రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి



మదనపల్లె, ఏప్రిల్ 3 ప్రభాతవార్త:

జనసేన పార్టీ బలోపేతానికి శాయశక్తులా కృషి చేయడం జరుగుతుందని ఆ పార్టీ రాయలసీమ కోకన్వీనర్ రాందాస్‌చౌదరి తెలిపారు. శుక్రవారం కమ్మవీధిలోని పార్టీ కార్యాలయంలో పూతలపట్టు జనసేన నాయకులు రఘురామచౌదరి రాందాస్‌చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు ఎల్లవేలలా అండగా ఉంటుందన్నారు. సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. పార్టీ అధినేత సిద్దాంతాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులుగా ఉన్న జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మెన్ జంగాల శివరామ్, ఐటి విభాగం నాయకులు కల్లూరు లక్ష్మీనారాయణ, తంబళ్ళపల్లె నాయకులు ఎంఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, గుండాల రామచంద్రా, నాయకులు గ్రానైట్‌బాబు, డైరెక్టర్ పయ్యావుల శ్రీనివాస్, పూల ప్రభాకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

రాయచోటి ఏప్రిల్ 3 ప్రభాతవార్త

పంచాయతీ సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం వారి స్థానంలో ప్రత్యేక అధికారులను నియ మించింది. అన్నమయ్య జిల్లాలోనీ రాయ చోటి రూరల్ మండలం లోని గ్రామ పంచాయ తీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ జిల్లా కలెక్టర్ నితీష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని 1) చెన్న ముక్కపల్లి, శిబ్యాల గ్రామాలకు ప్రత్యేక అధికారినిగా ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి 2) దిగువ అబ్బవరం గ్రామానికి ఎంపీడీవో కార్యాల యం ఏవో మధుసూద న్ రెడ్డి ని 3) గొర్లముదివే డు గ్రామానికి ఎంఈఓ 1 బాలాజీ నాయక్ 4) కాటిమాయ గుంటకు ఎంఈఓ టు వెంకట శివారెడ్డిని 5)ఎండ పల్లి, మాధవరం గ్రామా లకు డిప్యూటీ ఎంపీడీ వో సురేష్ బాబు 6) పెమ్మాడపల్లి, వరిగపాపి రెడ్డి గారి పల్లి గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో (ఎస్జిఎస్ డబ్ల్యు) కె. వెంకట శివారెడ్డి లను పంచాయతీ ప్రత్యేక అధికారులుగా నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ నుం డి ఎంపీడీవో కార్యాల యానికి ఉత్తర్వులు అందాయి.

## గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులు

కురబలకోట ఏప్రిల్ 3 ప్రభాతవార్త

గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామ పంచాయతీల సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీకి మూగియడంతో ప్రత్యేక అధికారులను నియమించింది. మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియమక ఉత్తర్వులను జారీ చేసింది. అంగళ్లు, తెట్టు గ్రామాలకు ఎంపీడీవో గంగయ్యను ప్రత్యేక అధికారిగా కురబలకోట ,ముదివేడు గ్రామాలకు డిప్యూటీ ఎంపీడీవో బాలమూర్తిని, ఎర్రబెల్లి ,కనసానివారిపల్లి, చింతమాకులపల్లి గ్రామాలకు ఎంపీడీవో ఆఫీస్ ఏ.ఓ నాగరాజును, మట్లివారిపల్లి నందిరెడ్డి గారి పల్లి గ్రామాలకు తాసిల్దార్ ధనుంజయలును, కడప క్రాస్, వనమరెడ్డి గారి పల్లి గ్రామాలకు ఎంఈఓ ద్వారకనాథును, దాదం వారి పల్లి, పిచ్చల వాండ్ల పల్లి గ్రామాలకు ఎంఈఓ 2 శ్రీనివాసులను ప్రత్యేక అధికారులుగా నియమించారు.

## విద్యుత్ టవర్ను ఢీకొన్న బలోరా పికప్



చిన్నమండెం ఏప్రిల్ 03 ప్రబాతవార్త:

మండలంలోని చిన్నమండెం సబ్ స్టేషన్ సమీపంలో రాయచోటి బెంగళూరు ప్రధాన రహదారి పక్కన దేవగుడిపల్లి వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ టవర్ను గురువారం రాత్రి రాయచోటి వైపు నుంచి అత్యంత వేగంగా మదనపల్లి వైపు వెళ్తున్న ఏ పి 39 యు జెడ్ 7374 నంబరు గల బల్లోరా పికప్ వ్యాను ఢీ కొట్టింది. దీంతో విద్యుత్ టవర్ వంగిపోయింది. ఈ ప్రమాదంలో వాహన డ్రైవర్ మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. బాధితున్ని ఆసుపత్రికి తరలించారు.

## తంబళ్లపల్లె మండలానికి 9 మంది ప్రత్యేక అధికారులు

తంబళ్లపల్లె ఏప్రిల్ 3 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలంలో సర్పంచుల పదవీకాలం ఏప్రిల్ రెండవ తేదీకి ముగియడంతో పంచాయతీల అభివృద్ధికి మండలంలో 21 పంచాయతీలకు 9 మంది ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. తంబళ్లపల్లె, పరసతోపు, పంచాలమర్రి పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, కుక్కరాజు పల్లి, రెడ్డి కోట, రేణుమాకులపల్లి పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో ఎం.వి ప్రసాద్, కోసువారిపల్లి, బాలిరెడ్డిగారిపల్లి పంచాయతీలకు తాసిల్దార్ సి.శ్రీనివాసులు, గంగిరెడ్డిపల్లి, దిగువపాలెం పంచాయతీలకు ఏవో జె.థామస్ రాజా, గోపిదిన్నె, జుంజురపెంట పంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో సి. మారుతీ కుమార్, కన్నెమడుగు, మర్రిమాకులపల్లి ఎంఈఓ బి.త్యాగరాజు, ఎద్దులవారిపల్లి, ఎర్రసానిపల్లి పంచాయతీలకు ఎంఈఓ2 నాగసుబ్బరాయుడు, కోటకొండ, ఎగువసుగాలితాండ పంచాయ తీలకు ఏవో కె.రమణ కుమార్, కొటాల, ఆర్ఎన్ తాండ పంచాయతీలకు మండల పశువైద్యాధికారి ఆర్.విక్రమ్‌రెడ్డి ప్రత్యేక అధికారులుగా కొనసాగునున్నారు.

# ప్రజలను మభ్య పెట్టేందుకే రాజధాని నిర్మాణంపై చంద్రబాబు వ్యాఖ్యలు

### మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ధ్వజం

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

రాష్ట్రంలో దేవతల రాజధాని అమరావతిని నిర్మిస్తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు కేవలం రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టేందుకేనని, రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని మాజీ ఎమ్మెల్యే వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక లక్ష ఎకరాలలో 2 లక్షల కోట్లతో అమరావతిని దేవతల రాజధానిగా నిర్మిస్తానని ప్రజలకు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. లక్ష ఎకరాలలో 2 లక్షల కోట్లతో రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న ఏడు సంవత్సరాలలో రాజధాని నిర్మాణం కోసం 8,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని చంద్రబాబు చెప్పినట్టుగా లక్ష ఎకరాలలో రెండు లక్షల కోట్లు ఖర్చు పెట్టాలంటే 200 ఏళ్లు పడుతుందని వివరించారు. లక్ష ఎకరాలలో మౌలిక వసతులు కల్పించాలంటే కష్ట సాధ్యమని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టి 22 నెలల కాలంలోనే సుమారు మూడున్నర లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారని విమర్శించారు. ఇంత అప్పు చేసిన ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలను అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయక టిడిపి నాయకులు దోచుకోవడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో క్రింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అవినీతి రాజ్యమేలుతోందని విమర్శించారు. కేవలం రాజధాని నిర్మాణం పేరుతో టిడిపి నాయకులు దోపిడీ చేయడం తప్ప మరొకటి కాదన్నారు. దేశంలో ఏ రాజధానిలో కూడా భవనాలు నిర్మించాలంటే ఒక అడుగుకు 4000 రూపాయలతో నిర్మిస్తారని కానీ దేవతల రాజధాని నిర్మించాలంటే చంద్రబాబు నాయుడుకు ఒక అడుగుకు 14 వేల రూపాయలు చెల్లించడంలో టిడిపి అవినీతి బట్టబైలవుతోందని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు గమనించి స్పందించాల్సిన సమయంలో స్పందిస్తేనే రాష్ట్ర ప్రజలు అప్పుల పాలు కాకుండా రక్షింపబడే అవకాశం ఉందని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర ప్రజలు సరైన నిర్ణయం తీసుకుని అవినీతి కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరవాలని ఆచరణ సాధ్యమయ్యే రాజధాని నిర్మించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.



# వైభవంగా అంకాలమ్మ తిరునాళ్ల

**పెండ్లిమర్రి, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**



మండలం రంపతాడు సమీపంలో వెలసిన అంకాలమ్మ తల్లి అమ్మవారు శుక్రవారం వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులు స్వామి అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అలాగే ఆలయ సమీపంలో బండలాగుడు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ సమీపంలో వైభవంగా కోలాట కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# తాగునీటి కోసం అష్టకష్టాలు



**పోరుమామిళ్ల రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :**

బి. కోడూరు మండలంలోని ఐత్రం పేట పంచాయతీ విజయనగర కాలనీలో త్రాగునీటి బోరు చెడిపోవడంతో గత నాలుగు రోజులుగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీరు కోసం పక్కన ఉన్న పొలాల్లోకి వెళ్లి తెచ్చుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఎ~పోతున్నారు. వేసవికాలం సంభవించడంతో నీటి కొరత రావడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి కష్టాలు తీర్చాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు.

# దాహార్తిని తీర్చే అమృత ధార - చలివేంద్రం

### చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎక్సైజ్ సిఐ సీతారామిరెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి



**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 03 ప్రభాతవార్త :**

పట్టణంలోని సిద్ధవటం రోడ్ ఎస్సీ హాస్టల్ వద్ద శుక్రవారం వేసవి తాపాన్ని తీర్చేందుకు ఉచిత మంచినీటి చలివేంద్రాన్ని ఎక్సైజ్ శాఖ సీఐ సీతారామిరెడ్డి, బద్వేల్ అర్బన్ ఎస్సై కొండారెడ్డి డాక్టర్ వాసుదేవా రెడ్డి, డాక్టర్ సత్యప్రసాద్, ఫైర్ ఆఫీసర్ చేతుల మీదుగా ప్రారంభించారు. మంచినీటి చలివేంద్రానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పలువురు అధికారులకు శాలువాలతో కె.వి సుబ్బారావు సి,వి నాగేశ్వరరావు మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్ చేతుల మీదుగా సత్కరించడం జరిగింది, ఈ సందర్భంగా సీఐ సీతారామి రెడ్డి, ఎస్ఐ కొండారెడ్డి, ఎక్సైజ్ శాఖ ఎస్సై సతీష్ కుమార్,వాసుదేవా హాస్పిటల్ డాక్టర్ వాసుదేవ రెడ్డి, ప్రసాద్ దంత వైద్యశాల నిపుణులు సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం ఎంతో సంతోషకరమన్నారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి ఏర్పాటు చేయడం వల్ల సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు, ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్న చలివేంద్రాలు ప్రస్తుత వేసవి కాలంలో ఎండల తీవ్రకు దృష్టి సామాన్య ప్రజలకు తాగునీరు అనేది అత్యవసరంగా మారిందన్నారు, వేసవికాలంలో చలివేంద్రాల వద్ద ప్రభుత్వ హాస్పిటల్లో ఉన్నటువంటి ఓఆర్ఎస్ ప్యాకెట్లను కూడా అందుబాటులో ఉండే విధంగా చలివేంద్ర నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని డాక్టర్ వాసుదేవరెడ్డి తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ ఆర్య వైశ్య వర్తక సంగం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు, ఆవోపా సెక్రటరీ సీ,వీ నాగేశ్వరరావు, వల్లంకొండు రాఘవేంద్ర, అనిత్, ఖాదర్ భాషా, ఆవులేటి శేఖర్ రాయల్, ఓబులేష్, బ్రహ్మయ్య, శీలం శంకర్, బ్రహ్మయ్య వ్నల్ల కొండు శివకుమార్ తో పాటు పలువురు సహకరించిన దాతలు ఎక్సైజ్, అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పులివెందులలో ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



పట్టణ పుర వీధుల గుండా సాగుతున్న క్రైస్తవుల ర్యాలీ



అన్నదాన కార్యక్రమం జరుగుతున్న దృశ్యం

**పులివెందుల, ఏప్రిల్ 3, ప్రభాత వార్త :**

పులివెందుల పట్టణంలో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సెయింట్ జోసెఫ్ చర్చితో పాటు పలు చర్చిలను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు శిలువలను ధరించి పట్టణంలో ర్యాలీగా సాగారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ శోకగీతాలు ఆలపిస్తూ, ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు, సందేశాలు నిర్వహించి, యేసుక్రీస్తు చూపిన మార్గంలో నడవాలని పాస్టర్లు భక్తులకు పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సౌహార్దం నెలకొనాలని ప్రార్థించారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు కూడా పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

### గోటూరు చిన్నప్ప ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహణ

గుడ్ ఫ్రైడే ని పురస్కరించు కొని స్థానిక సెయింట్ జోసెఫ్ రోమన్ క్యాథలిక్ చర్చిలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, గుంటూరు చిన్నప్ప భక్తులకు ప్రత్యేకంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ ఆరోగ్య స్వామి ప్రార్థనలు నిర్వహించి, యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ సందేశం అందించారు. అనంతరం భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉపదేశులు, సంఘ పెద్దలు, మత విశ్వాసులు, సెయింట్ ఆన్స్ కాన్వెంట్ సిస్టర్స్, లయోలా ఫాదర్స్ సిస్టర్స్, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా కొనసాగింది.

# అమరావతికి పార్లమెంట్ ఆమోదం

### కూటమి నాయకుల బైక్ ర్యాలీతో సంబరాలు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి పార్టీల నాయకులు

**పులివెందుల , ఏప్రిల్ 3 ప్రభాతవార్త :**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభలు ఆమోదం తెలిపిన నేపథ్యంలో, కూటమి ప్రభుత్వ విజయంగా పేర్కొంటూ పులివెందుల పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. చేతుల్లో జెండాలు పట్టుకుని నినాదాలు చేస్తూ, అమరావతి నిర్ణయాన్ని స్వాగతిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు కూటమి పార్టీల నాయకులు మాట్లాడుతూ, అమరావతిని రాజధానిగా నిలబెట్టడం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని, ఇది ప్రజల ఆశయాల సాధనగా నిలిచిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ కృషితో సాధ్యమైన ఈ నిర్ణయం రాష్ట్ర భవిష్యత్తుకు దోహదం చేస్తుందని అన్నారు. ర్యాలీ సందర్భంగా పట్టణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు తగిన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మధుసూదన్ రెడ్డి, ఆక్కుల గారి విజయ్ కుమార్ రెడ్డి, మహబూబ్ బాషా, నల్లగారి భాస్కర్ రెడ్డి, బిజెపి నాయకులు శశి భూషణ్ రెడ్డి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న

# ఉన్మాదుల ఆట అరికట్టించాలి

### యుద్ధంలో అసువులు బాసిన అమాయక ప్రజలకు కొవ్వొత్తులతో నివాళులు

**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త**




దురాక్రమణదారులు యుద్ధోన్మాదులు అయిన ట్రంప్‌నే తన్యాహులతో ప్రపంచ శాంతికి భంగం వాటిల్లుతుందని యుద్ధ వ్యతిరేక వేదిక నేతలు ఆందోళన వ్యక్తం చేశారు శుక్రవారం యుద్ధ వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో స్థానిక పుట్టపర్తి సర్కిల్లో ప్రజాసంఘాల నేతలు యుద్ధంలో అసువులు బాసిన అమాయక ప్రజలకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు ఈ యుద్ధం ఆగిపోయేలా భారత ప్రభుత్వం జోక్యం చేసుకొని దౌత్య రాజకీయాలు నడపాలని కోరారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుద్ధం ఆగదని ఇరాన్ దేశాన్ని తిరిగి రాతి యుగానికి పంపుతానని ఇరాన్ లొంగిపోయే దాకా ధ్వంసం చేస్తామని ట్రంపు ప్రపంచ దేశాలు అన్నింటిని యుద్ధంలోకి దింపుతున్నాడన్నారు చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు ధ్వంసం చేస్తున్నాడన్నారు మానవహనడానికి విలువైన ఇంధన వనరుల ధ్వంసం చేసి ప్రపంచ వినాశనానికి పాల్పడుతున్నారన్నారు ఈ యుద్ధం సామ్రాజ్యవాద దురాక్రమణ కాన్షతో అమెరికా ప్రపంచాన్ని గుప్పిట్లో పెట్టుకోవడానికి చేస్తున్నదన్నారు అమెరికాలోనే ట్రంప్ కు వ్యతిరేకంగా కోట్లాదిమంది ప్రజలు రోడ్లపైకి వచ్చి యుద్ధమాపాలని డిమాండ్ చేస్తున్నారన్నారు కానీ భారత్లో ఇంకా పెద్ద ఎత్తున యుద్ధం కు వ్యతిరేకంగా ప్రజలు రోడ్ల మీదికి రాకపోతే గ్యాస్ ధరలు పెట్రోల్ ధరలతో పాటు అన్ని రకాల ధరలు పెరిగి దేశంలో దారుణ పరిస్థితిలో దాపురిస్తాయి అన్నారు ఇందుకు కారణం భారత పాలకవర్గాలు యుద్ధం విషయంలో సరైన వైఖరి తీసుకోపోకపోవడమే కారణమన్నారు కార్యక్రమంలో విరసం వరలక్ష్మి, పీకేఎస్ శ్రీనివాస్ రెడ్డి ,పౌర హక్కుల సంఘం సురేష్ బాబు, మాల మహానాడు ఇమ్మానియేల్, మహిళా శక్తి వడ్ల లక్ష్మీదేవి,కాంగ్రెస్ నజీర్, హుస్సేన్ బాషాఎంపీ జే సలీం భాష,జాతీయ బీసీ సంక్షేమ సంఘం కృష్ణయ్య యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం శేఖర్, సిపిఐ శివారెడ్డి,జమాతే షఫీ, ఐద్వా ముంతాజ్ ,సిఎంఎస్ పద్మ పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 3, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు-మైదుకూరు రింగు రోడ్డులో శుక్రవారం ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం జమ్మలమడుగు వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రాజధాని అమరావతి చట్టబద్ధతపై

# వైకాపాది సెల్ఫ్ గోల్... టిడిపిది సెల్ఫ్ డబ్బా



**వేంపల్లె ఏప్రిల్ 03 ప్రభాతవార్త**

రాజధాని అమరావతి చట్టబద్ధతపై వైకాపా పార్టీ ది సెల్ఫ్ గోలని,టిడిపి పార్టీది సెల్ఫ్ డబ్బా అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. శుక్రవారం వేంపల్లె లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అదీ అమరావతి, దేవతల రాజధాని అమరావతి,ఆంధ్రుల రాజధాని అమరావతి అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి ఒకే విధానం మీద,ఒకే స్టాండ్ మీద ఉందని తులసి రెడ్డి వివరించారు. కానీ వైకాపా పార్టీ రాజధాని అమరావతి విషయంలో మొదటి నుంచి గందరగోళంలో, అయోమయంలో, కన్ఫ్యూజన్లో ఉందని తులసి రెడ్డి అన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిని విశాఖపట్నంకు మార్చాలంటూ మూడు ముక్కలాట ఆడారు. అధికారం పోయిన తర్వాత ప్రస్తుతం మావిగన్ ఫార్ములా అంటున్నారు అంటే మచిలీపట్నం విజయవాడ గుంటూరు అని పాట పాడుతున్నారు. బహుశా రేపు శ్రీవిపుల్ అనగా శ్రీకాకుళం విజయవాడ పులివెందుల పాట పాడవచ్చు.ఏది ఏమైనా రాజధాని అమరావతి విషయంలో వైకాపా పార్టీ సెల్ఫ్ గోల్ కొట్టుకుందని తులసి రెడ్డి అన్నారు. రాజధాని అమరావతి చట్టబద్ధత విషయంపై టిడిపిది సెల్ఫ్ డబ్బా అని తులసి రెడ్డి అన్నారు. ఇది కొత్తగా ఏర్పాటు అయింది కాదు. పది సంవత్సరాల నుంచి రాజధాని అమరావతి నుంచే పరిపాలన సాగుతోంది. ఇప్పటికే రెండుసార్లు ప్రధానమంత్రి శంకుస్థాపన కూడా చేశారు. ఇది ఏదో కొత్తగా రాజధాని అయినట్లు, కనీవినని అద్భుతం జరిగినట్లు టిడిపి నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరమని,అతి సర్వత్రా వర్జయేత్ అని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికైనా అమరావతి చట్టబద్ధతపై ప్రచారం తగ్గించుకొని చేయవలసిన వాటిపై దృష్టి సారించాలని తులసి రెడ్డి సూచించారు.

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమ్ఆద్మీపార్టీ మద్దతు

**వేంపల్లె ఏప్రిల్ 03 ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్ ప్రజా రాజధానిగా అమరావతికి రాజసభలో ఆమోదముద్ర వేయడం హర్షణీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా, జిల్లా ఉపాధ్యక్షులు దాదా పీర్ లు తెలిపారు. ఇందుకు తమ ఆమ్ఆద్మీపార్టీ జాతీయ నాయకత్వం అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయం మేరకు రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్ ఈబిల్లుకు మద్దతు ఇవ్వడంతో అమరావతి రాజధానిని ఆమోదించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ తరపున రాష్ట్ర కన్వీనర్ శిర. రమేష్ కుమార్ నాయుడు నాయకత్వం కూడా హర్షణీయం వ్యక్తం చేస్తూ అన్ని జిల్లాల ఆప్ కన్వీనర్లు హర్షనీయం వ్యక్తం చేయాలని పిలుపుచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం రహంతుల్లా, దాదాపీర్ లు మీడియా సమావేశం లో మాట్లాడుతూ రాజధాని అంటే తాత్కాలిక కట్టడాలు కట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా శాశ్వత కట్టడాలు కట్టి భారత దేశంలో ఏ రాష్ట్రంలో లేని రీతిలో రాజధాని అమరావతిని నిర్మించాలని తెలిపారు. ఇందులో భాగంగా నే మిగిలిన అన్ని జిల్లాలను అభివృద్ధి పరిచే దిశగా ముందడుగు వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఆమ్ఆద్మీపార్టీగా కోరుతున్నామన్నారు. అంతేకాకుండా కేంద్ర బిజెపి నాయకత్వం ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో ఇదివరకు బీజేపీ తో కూటమి ప్రభుత్వాలు కూలిపోయిన అంశాలు చాలానే చూశాము. కాబట్టి కాస్త జాగ్రత్తలు వహించి రాష్ట్రానికి రావాల్సిన అన్ని వనరులను పురోగతిన రాబట్టుకొని రాష్ట్ర నిర్మాణం పూర్తి చేయాలనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు పట్ల ఆలోచన చేసి ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీ తరపున సూచనలు ఇస్తున్నామంటూ రహంతుల్లా, దాదా పీర్ లు ప్రభుత్వానికి పలు సూచనలు ఇచ్చారు.

# ఘనంగా సీతారాముల కళ్యాణం



**నందలూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త :**

మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ అరవపల్లి ప్లే గ్రౌండ్ వద్ద సీతారాముల దేవస్థానం నందు శ్రీరామ నవమి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం సీతారాముల కళ్యాణాన్ని అర్చకులు సరస రవికుమార్ శర్మ కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ కళ్యాణానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ మేడ విజయభాస్కర్ రెడ్డి, రాజంపేట వైఎస్ఆర్సిపి ఇంచార్జ్ ఆకేపాటి అనిల్ కుమార్ రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని వైఎస్ఆర్సిపి మహిళా మండలి అధ్యక్షురాలు పల్లె మాధవి, మండల కో ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్ ఘనంగా సన్మానించారు. ఈ నేపథ్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను వేదికపై అత్యంత సుందరంగా ముస్తాబు చేసి ఆసీనులు గావించారు.భక్తుల రామనామ స్మరణల నడుమ కళ్యాణం కన్నుల పండుగ జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అరిగెల సౌమిత్రి చంద్రనాథ్, గుండు మల్లికార్జున రెడ్డి, నరసింహారెడ్డి, ఎముక దుర్గయ్య, విజయుడు, తదితరులు పాల్గొన్నారు.

# రాజారెడ్డిని పరామర్శించిన డీసీసీ బ్యాంక్ చైర్మన్

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 3, ప్రభాత వార్త**

బద్వేల్ నియోజకవర్గం లోని అట్లూరు మండలం కుంభగిరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పాలకొండు రాజారెడ్డిని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల మోకాళ్ల శస్త్రచికిత్స చేయించుకుని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న రాజారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్, బీరం జయరామిరెడ్డి, అరవ శ్రీనివాసులు రెడ్డి, పాలకొండు రాజశేఖర్ రెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, బోవిళ్ల నరసింహారెడ్డి, మాచుపల్లి కృష్ణారెడ్డి, ఉపత్తి సుబ్బారెడ్డి, పోటూరు నరసింహారెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి, గురు ప్రసాద్ రెడ్డి, రాచపల్లి గంగాధర్ రెడ్డి, దేవర వెంకటేష్, కాసుల అయ్యవారయ్య, అట్లూరి సంజీవు, సగిలి రాజా, మట్టే ఈశ్వర్ రెడ్డి, కోటపాటి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



# అశ్వ వాహనంపై కోదండరాముని దివ్య రాజసం

**.ఒంటిమిట్ట ఏప్రిల్.03ప్రభాతవార్త**

ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు శుక్రవారం రాత్రి టీటీడీ పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా అశ్వ వాహనంపై శ్రీ రామచంద్రమూర్తి విశేష కల్కి అవతారంలో జగదభిరాముని గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు శ్రీవారిని వివిధ రకాల పుష్పాలతో తీర్చిదిద్దారు. శ్రీ రామ ఉత్సవ వరును అర్చకులు నూతన వస్త్రాలతో, వివిధ రకాల ఆభరణాలతో పుష్పాలతో విశేషంగా అలంకరించి పల్లకిపై ఆసీనులను గావించి గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలే కాకుండా పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అత్యంత భక్తిశ్రద్ధలతో వేడుకలో పాల్గొన్నారు. భక్తజన రంజకంగా ఏకశిలానగరం ఒంటిమిట్ట పుర వీధుల గుండా కల్కి అవతార రూపుడైన శ్రీ కోదండ రామస్వామి నానాలంకరణ శోభితుడై పల్లకిని అధిష్టించి ఉత్సవంలో పాల్గొన్న భక్తులను ,పుర ప్రజలను కటాక్షించారు. అడుగడుగునా భక్తులు నీరాజనాలు అందించారు. రామ నామ సంకీర్తనల, కేరళ వాయిద్యాల మహిళల సాంస్కృతిక కార్యక్రమాల కోలాటాల నడుమ భక్తిరస మాధుర్యంగా సాగింది.





